## 6

# అనుసరించే వారి కోసం మూడు నియమాలు

## (హెబ్రీయులకు 13:7, 17, 24ఎ)

*పెద్దల నియామక కూడిక ప్రసంగానికి సమయమివ్వదు కానీ నేను చేసే కార్యక్రమంలో చిన్న ప్రసంగం చెప్తాను. పెద్దల నియామకానికి సంబంధించి నేను చెప్పిన ప్రసంగం ఇది.*

ఎన్నో నెలల నుండి, మనం పెద్దల బాధ్యతలను గురించి అధ్యయనం చేస్తున్నాము. ఈ రోజున సంఘంగా మనం పెద్దల పట్ల చూపించాల్సిన బాధ్యత గురించి చెప్పాలనుకుంటున్నాను. పెద్దలు మరియు సంఘస్థుల మధ్య ఉండాల్సిన *సంబంధం* మీద దృష్టించాలనుకుంటున్నాను. నడిపించే వారిని అనుసరించేందుకు సంఘం తీర్మానించుకోకుంటే అసలు *నాయకత్వమే* ఉండదు. అనుసరించే వారికోసం "మూడు నియమాలు" అని ఈ పాఠాన్ని పిలువాలనుకుంటున్నాను.

నా వాక్యభాగం హెబ్రీయులకు 13వ అధ్యాయం. హెబ్రీ పత్రిక సంఘంలోనే ఒక గుంపుకు వ్రాయబడింది. వారు ఒకప్పుడు నమ్మకమైన వారే కానీ తరువాత తొలిగిపోయారు. వారింక ఆరాధనకు రావడం లేదు (చూడండి హెబ్రీయులకు 10:24, 25), వారికి దేవుని నియమిత పెద్దలు పట్ల కొంచెం గౌరవం ఉంది. దాని ఫలితంగా చివరి అధ్యాయంలో వారు పెద్దల యెడల చూపించాల్సిన సంబంధం గురించి మూడు విషయాలు చెప్పబడ్డాయి. మనం మన పెద్దల యెడల ఎలా ఉండాలన్న విషయాన్ని అవి మనకు బోధిస్తున్నాయి.

### నియమం 1: మంచి మనస్సుతో నాయకులను జ్ఞాపకం చేసుకోండి (13:7)

గ్రంథకర్త మొదటిగా పూర్వపు నాయకుల గురించి చెప్తున్నాడు: "మీకు దేవుని వాక్యము బోధించి మీపైన నాయకులుగా ఉన్నవారిని జ్ఞాపకము చేసుకొని వారి ప్రవర్తన ఫలమును శ్రద్ధగా తలంచుకొనుచు వారి విశ్వాసమును అనుసరించుడి" (7 వచనం). వాక్యంలో పెద్దలు అనుమాట స్పష్టంగా కనిపిస్తున్నా, గ్రంథకర్త మదిలో నాయకులు మాత్రమే లేరని స్పష్టమవుతుంది.

మీరు కూడా అలాగే, "మీకు దేవుని వాక్యము బోధించి మీపైని నాయకులుగా ఉన్న వారిని జ్ఞాపకము చేసుకునేందుకు" (7ఎ వచనం). సవాలు చేయబడుతున్నారు. మీ మనస్సులోని చిత్రాలను చూడండి. మీ ఆత్మీయ జీవితానికి ధన్యత నిచ్చిన వారందరిని మీ తల్లిదండ్రులు, టీచర్లు, సువార్తికులు, మీరు ప్రేమించే దైవజనులు ... ప్రత్యేకించి సంఘ పెద్దలు. వీరందరిని మననం చేసుకోండి. నా విషయంలోనైతే అనేక మంది పెద్దలు, దైవజనులు నాకు మేలు చేశారు.

"వారి ప్రవర్తన ఫలమును శ్రద్ధగా తలంచుకోండి" అని గ్రంథకర్త అంటున్నాడు (7బి వచనం). "తలంచుకోవడం" యొక్క గ్రీకు పదం మామూలుగా తలంచుకోవడాన్ని సూచించదు. దీనికి తీక్షణంగా చూడడం. *జాగ్రత్తగా* తలపోసుకోవడం, ఆలోచించడం

అని అర్థం.[1] ఒక్కసారి ఆలోచించండి. పూర్వపు నాయకుల విషయంలో వారి జీవితంలోని ఏది మిమ్మల్ని ప్రభావితం చేసింది? వారు జీవించిన మాదిరిగానే జీవించేందుకు మీరు ప్రయత్నిస్తున్నారా? మీరు వారి లోటుపాట్లు తప్పులను (మనకందరికి ఉన్నట్టు) గాక "వారి విశ్వాసాన్ని" అనుసరించాలి (7సి వచనం).

## నియమం 2: వినయ మనస్సుతో నాయకులను గౌరవించండి (13:17)

17వ వచనంలో గ్రంథకర్త తన దృష్టిని ప్రస్తుత నాయకుల మీదను మళ్లిస్తున్నాడు. "మీ పైని నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్పచెప్పవలసిన వారివలె మీ ఆత్మలను కాయుచున్నారు వారు దుఃఖముతో ఆ పని చేసినయెడల మీకు నిష్ప్రయోజనము గనుక దుఃఖముతో కాక, ఆనందముతో చేయునట్లు వారి మాట విని, వారికి లోబడియుండుడి."

పెద్దల "మాటవిని వారికి లోబడియుండుమని" (17ఎ వచనం). మనం చెప్పబడ్డాము ఎందుకు? ఎందుకంటే, "వారు లెక్క ఒప్పచెప్పవలసిన వారివలె మీ ఆత్మలను కాయుచున్నారు." (17బి వచనం). ఇది దేవుని వాక్యాన్ని బోధించే ప్రతి ఒక్కరికీ అన్వయించబడుతుంది. వీరి మాటలను విను వారందరూ వారికి లోబడియుండాలి. అంతేగాక వాక్యాన్ని బోధించువారందరూ తమ పరిచర్యలో తామెంత నమ్మకంగా ఉన్నామో చెప్తూ వారి లెక్క దేవునికి అప్పగించాలి. ఈ మాటలు వ్రాస్తున్నప్పుడు గ్రంథకర్త మనస్సులో ప్రత్యేకించి పెద్దలే ఉన్నారు. "వాక్యాన్ని విని దానికి లోబడియుండుడి" అని 17 వచనం చెప్పడం లేదు గాని "*నాయకుల మాట* విని వారికి *లోబడియుండుడి"* అని చెప్తుంది.

"మాట విని" "లోబడియుండడం" అను మాటలకు అర్థం పెద్దలు చెప్పు ప్రతి మాటకు, నిర్ణయానికి అనాలోచితంగా సమ్మతిని తెలుపడం కాదు.[2] ఉదాహరణకు, వారు దేవుని వాక్యానికి భిన్నంగా ఏదైనా చేసేందుకు మనల్ని కోరితే మనం దాన్ని వ్యతిరేకించాలి (చూడండి అపొస్తలుల కార్యములు 5:29). అలాగే విమర్శ లేదా తీర్పు విషయంలోనూ, మనం మంచి ఆత్మతో నున్నప్పుడు మనకు వారు చెప్పింది సరికాదు, అని అన్పించినప్పుడు వారితో విభేదించడం వారితో పంచుకోడం తప్పుకాదు. తెలివైన కాపరులు తమ మంద మాట వింటారు. (సంఘం పెద్దలను గౌరవించాలి, పెద్దలు సంఘస్థులను గౌరవించాలి.) ఆఖరకు, నిర్ణయం తీసుకునేది పెద్దలే? వారి నిర్ణయ విషయమై దేవునికి లెక్క అప్పగించాల్సింది పెద్దలే! క్లుప్తంగా చెప్పాలంటే, మనం పెద్దల ఆత్మీయ నాయకత్వాన్ని గుర్తించాలి. గొఱ్ఱెలు తమను ప్రేమించే, తన క్షేమాన్ని కోరుకునే కాపరిని అనుసరించునట్లు మనం వారిని అనుసరించాలి.

నా అనుభవం ప్రకారం, తీర్పు మరియు అభిప్రాయ విషయంలో సంఘస్థులు వినయ మనస్సుతో నుండలేరు. మీరు ఆలోచిస్తే, పెద్దలు సరైన నిర్ణయం తీసుకునేది తీర్పులోనే. విశ్వాస విషయంలో వారు తీర్పు ఇవ్వలేరు. ఎందుకంటే దేవుడు దీని విషయమై తన తీర్పును వాక్యంలో ఇది వరకే ఇచ్చియున్నాడు. వారి తీర్పులన్నీ వాక్యాన్నీ అన్వయించడం, మరియు అభిప్రాయ విషయం వరకే పరిమితం. ఇందులో సంఘ నిర్మాణం చేయడం, ఆరాధనా క్రమం నడిపించడం, బోధకున్ని ఎన్నుకోవడం లేదా తప్పించడం, మరిన్ని నాయకత్వ మార్పులు చేయడం వంటివి ఉంటాయి.

వినయ మనస్సుతో మన నాయకులను గౌరవించడం ఎందుకు ప్రాముఖ్యం? ఎందుకంటే

వారికి ఎంతో గొప్ప బాధ్యత ఉంది. వారి భారాన్ని మనం తేలిక చేయాలే గాని భారం చేయకూడదు. "వారు లెక్క ఒప్పచెప్పవలసిన వారివలె" మన ఆత్మలను "కాయుచున్నారు" (17బి వచనం).[3] కాయడం "Keep watch" అనేది "నిద్రలేకుండుట"[4] అను అర్థాన్నిస్తుంది. సంఘస్థుల సమస్యలలో వారికి సహాయమందించేందుకు అనేకమంది పెద్దలు ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

"ఈ పనిని (ఆత్మలను కాయడం) దుఃఖముతో కాక ఆనందముతో చేయునట్లు వారికి లోబడియుండుడి" (17సి వచనం). అని గ్రంథకర్త వ్రాస్తున్నాడు. మీరు, నేను గౌరవంగా, వినయంగా ఉంటే, వారి పని ఆనందంగా ఉంటుంది. అప్పుడు వారు యోహాను చెప్పినట్లు "నా పిల్లలు సత్యమును అనుసరించి నడుచుకొనుచున్నారని వినుటకంటే నాకు ఎక్కువైన సంతోషము లేదు" అని చెప్తారు (3 యోహాను 4; చూడండి 1 థెస్సలొనీకయులకు 2:20). మనం అగౌరవంగా, అవిధేయతగా ఉంటే వారు దుఃఖకరంగా ఉంటారు. "దుఃఖం" అన్న మాటకు "మూలుగుతో నిట్టూర్చడం" అని అర్థం. "నీ ఆత్మీయ మేళ్లకు దెబ్బ తగిలితే, తమ కాళ్లు కాల్చివేయబడినట్లు" పెద్దలు భావిస్తారు అని ఒకరు అన్నారు.

### నియమం 3: ప్రేమపూర్వక మనస్సుతో వారితో అనుబంధం కలిగియుండండి (13:24ఎ)

చివరిగా, "మీపైని నాయకులైన వారికందరికీ, పరిశుద్ధులందరికిని వందనములు చెప్పుడి" (24ఎ వచనం). అని గ్రంథకర్త వ్రాస్తున్నాడు సంఘంలో ఇతరులతో సంబంధం లేని వారికి, పెద్దలు సంఘస్థులతో తమ సంబంధాన్ని పునరుద్ధరించుకోవాల్సిన వారినుద్దేశించి గ్రంథకర్త ఈ పత్రికను వ్రాస్తున్నాడని అనేకమంది నమ్ముతారు. "వందనములు చెప్పడం" అను మాట పలకరించడం కంటే ఎంతో అర్థాన్నిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ పదానికి ఒక అనుబంధం కలిగియుండడం ఆత్మీయ సంబంధాన్ని పునరుద్ధరించడం వంటి అర్థాలున్నాయి. మన స్థానిక సంఘంలోనూ మనకు ఇలాంటి సంబంధము అవసరం. మనం గొఱ్ఱెలము, వారు ఆత్మీయ నాయకులు అన్న విషయాన్ని గుర్తుంచుకోండి. కాపరికి గొఱ్ఱెలు తెలిసియుండాలి, గొఱ్ఱెలు కాపరిని ఎరిగియుండాలి. మన పెద్దలతో ప్రేమపూర్వక సంబంధాన్ని మనం కలిగియుండాలి.

## ముగింపు

రాబోవు దినాల్లో, నియమిత మవుతున్న నూతన పెద్దలు తమ బాధ్యతలను స్వీకరిస్తుండగా, అనుచరులుగా మనం ఈ నియమాలను మర్చిపోకూడదు:

- మంచి మనస్సుతో నాయకులను జ్ఞాపకం చేసుకోవాలి.
- వినయ మనస్సుతో నాయకులను గౌరవించాలి.
- ప్రేమగల మనస్సుతో వారితో అనుబంధం కలిగియుండాలి.

(ప్రార్థనతో దీన్ని ముగించండి.)

సూచనలు

[1]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 59-60. [2]"గ్రుడ్డివారు గ్రుడ్డివారిని" నడిపించే పరిస్థితులు మేం కల్పించాలనుకోవడం లేదు (చూడండి మత్తయి 15:14). [3]తీతు 1లో పౌలు పెద్దలను గృహనిర్వాహకులని పిలుస్తున్నాడు (7 వచనం). వీరు లెక్క అప్పగించాలి (చూడండి లూకా 16:2). గృహనిర్వాహకులు నమ్మదగిన వారై యుండాలని 1 కొరింథీయులకు 4:2లో పౌలు వ్రాస్తున్నారు. [4]Vine, 667.